కాంగ్రెస్ సోషల్ మీడియా డీసీవోగా శ్రీకాంత్

రెంజల్, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ (డీసీవో)గా రెంజల్ మండలం పేపర్‌మిల్ గ్రామానికి చెందిన అబ్బోళ్ల శ్రీకాంత్‌ను నియమిస్తూ జాతీయ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మనుజైన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అబ్బోళ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. తన నియమాకానికి కృషి చేసిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డికి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి నరాల నిహార్, యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జికి కృతజ్ఞతలు తెలి



బీఆర్‌ఎస్ నుంచి ఆడబిడ్డ అవుట్..

భారత రాష్ట్ర సమితిలో బహిష్కృ'రణం'

“ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ, ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ నిర్ణయం తీసుకోవడం జిల్లాలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. ఆమె పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతుండటంతో గులాబీ దళం నుంచి బహిష్కరిస్తూ పార్టీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, సోమ భరత్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం ప్రకటన విడుదల చేశారు. తన తండ్రి ఏర్పాటు చేసిన పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం జిల్లాలో తీవ్ర చర్చకు దారిసింది.

- కవిత సస్పెన్షన్‌తో కలకలం
- ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత ప్రాతినిధ్యం
- స్థానికంగా క్రమంగా పడిపోయిన కేసీఆర్ తనయ గ్రాఫ్
- సోషల్ మీడియా వేదికగా మొదలైన వార్
- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా యోచనలో నాయకురాలు
- బీఆర్‌ఎస్‌లో ఉండేదెవరు..? ఆమె వెంట వెళ్లేదెవరు..?
- హైకమాండ్ నిర్ణయంపై జిల్లా వ్యాప్తంగా జోరుగా చర్చ



బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ప్లెక్సీపై ఉన్న కవిత ఫొటోపై తెల్ల కాగితం అతికించిన దృశ్యం (సర్కిల్‌లో)

నిజామాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజకీయ వర్గాల్లో కవిత సస్పెన్షన్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్‌ఎస్ శ్రేణులతో పాటు ఇతర పార్టీ శ్రేణులు సైతం కవిత సస్పెన్షన్ గురించే మాట్లాడుకుంటున్నారు. జిల్లాలో ఎంపీగా పనిచేసి ప్రస్తుతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గా ఉన్న కవితకు భారీగా అనుచరగణం ఉంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆమె అనుచరులు ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఆమెను సస్పెండ్ చేసిన నేపథ్యంలో వారంతా ఇప్పుడు ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నారు. పార్టీ నాయకులు సైతం ఆమె వెంట ఎంత మంది బయటకు వెళ్తారు, ఎంత మంది పార్టీలో ఉంటారనే విషయంలో అంచనాలు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్సీ పదవిపై చర్చ...

ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కవితను బీఆర్‌ఎస్ సస్పెండ్ చేయడంతో ఆమె ఎమ్మెల్సీ పదవిలో కొనసాగుతారో లేదోనన్న చర్చ జరుగుతోంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత 2020లో భూపతిరెడ్డిపై అనర్హత వేటుతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని కవితకు ఇచ్చారు. రెండేళ్ల పాటు ఆ పదవిలో ఉన్న కవిత 2021 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2022 జనవరిలో ఆమె ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. 2028 జనవరి వరకు ఆమె ఎమ్మెల్సీ పదవి కాలం ఉంది.

సఖ్యత ప్రదర్శించని నాయకులు..

కొద్దికాలంగా కవిత పార్టీలోని పలువురు నాయకులపై బహిరంగంగా విమర్శలు చేయగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడం లేదు. తెలంగాణ జాగృతి పేరుతోనే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పార్టీ నేతలతో విభేదాల కారణంగా పార్టీకి దూరంగా ఉన్న కవిత ఇటీవల జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆమె దగ్గరికి పెద్దస్థాయి నాయకులెవరూ వెళ్లలేదు. ఆమె అనుచరులు సైతం కేవలం కేసీఆర్ ఫొటో ఉన్న స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. తీన్మార్ మల్లన్న కవితపై చేసిన వ్యాఖ్యలపై కూడా జిల్లాలో పార్టీ శ్రేణులు స్పందించలేదు. ఇప్పుడు ఏకంగా పార్టీ నుంచే సస్పెండ్ చేసినప్పటికీ జిల్లాలో ఆమె అనుచరులుగానీ, పార్టీ నాయకులు కానీ ఆమెకు మద్దతుగా స్పందించకపోవడం పార్టీలో ఆమె ప్రభావం క్రమ క్రమంగా తగ్గిందనే విషయాన్ని తెలియజేస్తోంది.

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా..?

ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కవిత పార్టీ నుంచి సస్పెండ్ కావడంతో ఎమ్మెల్సీ పదవిపై ఊహాగానాలు వస్తున్నాయి. పార్టీ సస్పెండ్ చేయడంతో పార్టీ ద్వారా పొందిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసే యోచనలో ఆమె ఉన్నట్లు సమాచారం.

మిగతా 8వ పేజీలో...

రేపు కామారెడ్డికి ముఖ్యమంత్రి రాక!

- ఎల్లారెడ్డిలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- మల్లుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అధికారులతో సమీక్ష
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం



కామారెడ్డి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కామారెడ్డి జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించనున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఆయా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాన్ని తెలుసుకోనున్నారు. కామారెడ్డి పట్టణంలోనూ సీఎం పర్యటించనున్నట్లు తెలిసింది. లింగంపేట మండలంలోని మోతే గ్రామంలో ముంపునకు గురైన పంట పొలాలను మొదట సీఎం పరిశీలిస్తారు. అనంతరం లింగంపల్లికుర్దులో రోడ్డు భవనాల శాఖకు చెందిన దెబ్బతిన్న వంతెనను రోడ్లను పరిశీలించనున్నారు. ఎల్లారెడ్డి మండలంలో తిమ్మారెడ్డి గ్రామంలో దెబ్బతిన్న పంటలను సందర్శించనున్నారు. అనంతరం పోచారం ప్రాజెక్ట్‌కు చేరుకుని పరిశీలిస్తారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారంలో కొట్టుకుపోయిన జాతీయ రహదారి, విద్యుత్‌మౌలిక సదుపాయాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం నాగిరెడ్డిపేట మండలంలోని మల్లుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఫొటో ప్రదర్శన అనంతరం వరదల వల్ల చేకురిన నష్టాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించనున్నట్లు తెలిసింది. అనంతరం కామారెడ్డిలోను వరద ప్రభావిత ప్రాంతాలైన హౌజింగ్‌బోర్డు, జీఆర్‌కాలనీలోను పర్యటించి వరద బాధితులను పరామర్శించనున్నట్లు సమాచారం.

ఏర్పాట్లకు సిద్ధమవుతున్న యంత్రాంగం

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెల 28న వరదలు పోటెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అదేరోజు సీఎం కామారెడ్డిలో ఏరియల్ సర్వే నిర్వహించి పోలీసుకార్యాలయంలో అధికారులతో వరదల నష్టంపై సమీక్షించాల్సి ఉండేది. అనివార్య కారణాల వల్ల సీఎం కామారెడ్డిలో హెలికాప్టర్‌లోనే ఏరియల్ సర్వే నిర్వహించి మెదక్ వెళ్లిపోయారు.

నిజాంసాగర్ ప్రాజెక్టులో లో లెవెల్ నీటిమట్టం

- కొనసాగుతున్న 14 వరద గేట్లు
- 97,070 క్యూసెక్కుల వరద
- ప్రస్తుతం ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు 13.100 టీఎంసీల నీటి మట్టం

7



అరకొర యూరియాపై రైతుల ఆగ్రహం

- సొసైటీల వద్దకు భారీగా తరలివచ్చిన రైతులు
- వ్యవసాయ అధికారులు సర్దిచెప్పినా వినని రైతులు
- మిన్నకుండిపోయిన పోలీసులు
- కామారెడ్డి జిల్లా పాల్వంచలో యూరియా పంపిణీ వాయిదా వేసిన అధికారులు

7

నీట మునిగిన పంటల పరిశీలన

- రెంజల్‌లో శాస్త్రవేత్తలు, నవీపేటలో ధ్వంసమైన పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

రైతులు అధైర్య పడకండి.. ఆదుకుంటాం

- ప్రభుత్వం అందరికి న్యాయం చేస్తుంది
- అధికారుల సమన్వయ కృషి అభినందనీయం
- విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

సాలూర, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తు దురదృష్టకరమని, పంట నష్టం వాటిల్లిన రైతులు, ముంపు బాధితులు అధైర్యపడవద్దని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి సాలూర మండలంలోని ఖాజాపూర్, హున్స, మందర్నా గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను, కూలిన ఇళ్లను ఆయన పరిశీలించారు. నష్టం వాటిల్లిన పంట వివరాలను వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారని తెలిపారు. పంట నష్టం వివరాలు పూర్తిస్థాయిలో ప్రాథమిక అంచనలు వేసి నివేదికలు ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరి చేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌లకు వెంటవెంటనే మరమ్మతులు చేయాలన్నారు. ప్రజలకు, రైతులకు తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మందర్నా, సుంకిని గ్రామానికి వెళ్లే రోడ్డు వెంటనే మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలలో నీటి సమస్య లేకుండా చూడాలని పరిశుభ్రతపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, సీనియర్ నాయకులు ఇల్తెపు శంకర్, అల్లె రమేష్, సంజీవ్ రెడ్డి, దాము, ఖాజాపూర్ అశోక్, సాలూర తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి శ్వేత పాల్గొన్నారు.


సాలూరలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


ఆసుపత్రిలో బాధితుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై

కత్తెర పోట్ల కలకలం

- ఒకరి మృతి
- నలుగురికి గాయాలు
- ఆస్పత్రికి తరలింపు

ధర్పల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల బీసీ కాలనీలో మంగళవారం ఉదయం కత్తెర పోట్ల కలకలం నెలకొంది. ఏం జరుగుతుందో తెలియక కాలనీ వాసులు పరుగులు తీశారు. మండల కేంద్రానికి చెందిన కోటగిరి దాసు అనే వ్యక్తి ఉదయం కాలనీలోగల మచ్చ లక్ష్మి ఇంట్లోకి ప్రవేశించి వాగ్వాదానికి దిగాడు. తన భార్య విడిపోవడానికి కారణం లక్ష్మి(40) అనే అనుమానంతో వెంట తెచ్చుకున్న కత్తెరతో దాడి చేశాడు. అడ్డుగా వచ్చిన లక్ష్మి కూతురు గౌతమిపైన సైతం కత్తెరతో దాడి చేశాడు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి తల్లి బిడ్డలను కాపాడే ప్రయత్నం చేశారు. వారిని సైతం కత్తెరతో పొడిచి గాయపర్చాడు. అనంతరం కాలనీలోగల బోజేశ్వర్ కిరాణా షాపునకు వెళ్లి అతణ్ని సైతం దాసు కత్తెరతో పొడిచి గాయపర్చాడు. అనంతరం దాసు నడుచుకుంటూ వెళ్లిపోయాడు. ఎస్సై కళ్యాణి ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. దాసును అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మిని జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో గాయపడిన మరో నలుగురికి ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ సంఘటనలో మచ్చ గౌతమి, శెట్పల్లి బోజేశ్వర్, శెట్పల్లి నాగరాజు, శెట్పల్లి శోభలకు గాయాలు అయ్యాయి.

నిమజ్జనోత్సవంలో.. నిబంధనలు తప్పని సరి

- శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించిన కలెక్టర్, సీపీ
- అపశ్రుతులకు తావులేకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశం


ఉమ్మెడ బ్రిడ్జి వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో సీపీ, ఇతర అధికారులు

సుభాష్‌నగర్ /నవీపేట్/నందిపేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ గణేష్‌ని మజ్జనోత్సవం జరుపుకోవాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, ఇతర అధికారులతో కలిసి ప్రత్యేక బస్సులో కలెక్టర్ మంగళవారం వినాయక శోభాయాత్ర కొనసాగే మార్గాలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతం నుంచి శోభాయాత్ర ప్రారంభం కానుండగా భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే యంచ శివారులోని గోదావరి బ్రిడ్జి వరకు గల మార్గాన్ని కలెక్టర్, సీపీ నిశితంగా పరిశీలించారు. అక్కడక్కడా ధ్వంసమైన రోడ్డును యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను పైకి బిగించాలని సూచించారు. జానకంపేట్ రైల్వే క్రాసింగ్ మీదుగా ఎనిమిది అడుగులకు పైబడి ఎత్తుకలిగిన విగ్రహాలను తరలించే వీలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గంగా నందిపేట మండలంలోని ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేయనున్నారు.

మిగతా 8వ పేజీలో...



లెక్క తేలింది..

జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

- జిల్లాలో 8. 51లక్షల ఓటర్లు
- గ్రామ పంచాయతీ, వార్డుల వారిగా తుది జాబితా ప్రకటించిన అధికారులు
- మహిళా ఓటర్లు 4లక్షల 54వేల 621
- పురుష ఓటర్లు 3లక్షల 96వేల 778

నిజామాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితా సవరణలకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో మంగళవారం ఓటర్ల తుది జాబితాను అధికారులు వెల్లడించారు. ఈనెల 28న గ్రామ పంచాయతీలలో ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రదర్శించగా 29న జిల్లాస్థాయిలో, 30న మండల స్థాయి లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై ఆగస్టు 28 నుంచి 30 వరకు అభ్యంతరాలు స్వీకరించారు. ఆగస్టు 31న వచ్చిన పరిష్కరించి మంగళవారం జిల్లాలోని 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాను ప్రకటించారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించారు. జిల్లా యంత్రాంగం ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 8లక్షల 51వేల 417 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 4లక్షల 54వేల 621 కాగా పురుష ఓటర్లు 3లక్షల 96వేల 778 మంది ఉన్నారు. ఇతరులు 18 మంది ఉన్నారు. మొత్తం 545 గ్రామ పంచాయతీలలో 5,022 వార్డుల వారిగా, 5053 పోలింగ్ స్టేషన్ల వారిగా ఓటర్ల జాబితాను ప్రకటించారు. రెవెన్యూ డివిజన్‌ల వారీగా ఓటర్ల జాబితాను ప్రకటించారు.

మిగతా 8వ పేజీలో...

గణేష్ మండపాల వద్ద అన్నదానం



నవీపేటలో అన్నదానం నిర్వహిస్తున్న మండలి సభ్యులు

నవీపేట/పెర్కిట్/కమ్మర్‌పల్లి/ఏర్గట్ల,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో గణేష్ మండపాల వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నవీపేటలోని శ్రీ భారత్ జ్యోతి గణేష్ మండలి ఏర్పాటు జరిగి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గణేష్ మండలి వ్యవస్థాపకులతో పాటు స్థానిక పంచాయతీ కార్మికులను శాలువాతో సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పెర్కిట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా పట్టణంలోని పలు గణపతి మండపాల వద్ద మంగళవారం అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి మండపాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అంతకు ముందు మహిళలు కుంకుమార్చన, పలు గణపతి మండపాల వద్ద యజ్ఞహోమాలు నిర్వహించారు. కమ్మర్‌పల్లిలో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో ప్రతిష్ఠించిన వినాయక మండపాలవద్ద అన్న సత్ర కార్యక్రమాలు జోరందుకున్నాయి. మంగళవారం కమ్మర్‌పల్లి లో ఎస్ఎస్‌సి 2007-08 బ్యాచ్ వినాయకుడివద్ద అన్నసత్రం నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు హజరై ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి ఎస్ ఐ అనీల్ రెడ్డి, విడిసి అధ్యక్షుడు రామస్వామి, వినాయక మండప నిర్వాణ కమిటి అధ్యక్షులు ఉట్నూర్ రాకేష్, ఉపాధ్యక్షులు మైలారం మధుకర్, కోశాధికారి పసుపుల వంశి, పదవతరగత పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని నవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో మంగళవారం గణేష్ మండలి వద్ద అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించగా గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వినాయకునికి పూజలు నిర్వహించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పొతుకూరి మహేష్, ఉపాధ్యక్షులు మారు మహిపాల్, యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పదు

» బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్/వేల్పూర్/ఆర్మూర్/కమ్మర్‌పల్లిఆలూర్ ఏర్గట్ల/ముప్కాల్/డొంకేశ్వర్ సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పదదని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి వద్ద దివంగత ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం పేద ప్రజల అభ్యున్నతి కోసం రాజశేఖర్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆరోగ్యశ్రీ పథక రూపశిల్పి, రైతుపక్షపాతి అని ఆయన చేసిన సేవలను ప్రజలు ఎన్నటికి మరిచి పోలేరని ఆయన ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, సీనియర్ నాయకులు సాంబిరెడ్డి, శ్రీనివాస్, బిక్షరామ్మోహన్,సంజీవ్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఇంచార్జి మోహన్, మాజీ ఉపసర్పంచ్ టిసి భూమేశ్వర్, తెలంగాణ ఉద్యమకారుడు దుమాల బాబురావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలో మంగళవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకట్ రాం రెడ్డి, జిమ్మిరవి, మర్కజ్ కమిటి అధ్యక్షుడు మ హ మూద్‌అలీ, బీసీసెల్ పట్టణ అధ్యక్షుడు దొండి రమణ, గిరి,వాసు, అబి, విజయ్ అగర్వాల్, చిట్టిరెడ్డి, పాల్గొన్నారు.



వైఎస్సార్ నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే



వైఎస్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కమ్మర్‌పల్లి, హసాకొత్తూర్ గ్రామాలలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు మండల కాంగ్రెస్ నాయకులు ఘన నివాళి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, బుచ్చి మల్లయ్య, నిమ్మరాజేంద్ర ప్రసాద్, గణేష్ గౌడ్, సింగిరెడ్డి శేఖర్, అజారోద్దీన్, పూజారి శేఖర్, పడిగెల ప్రవీన్, రేవతి గంగాధర్, లింగారెడ్డి, ఏనుగు మనోహర్ కుందేటి శ్రీనివాస్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు, రైతుల కోసం చేపట్టిని రాయితీలు, ఉచిత విద్యు త్ వంటి పథకాలు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయాయని, ఆయన చూపిన మార్గదర్శ కత్వం అందరికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైస్ మల్లారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బార్ల ముత్యం, కుంట నారాయణ, కుర్మె చిరంజీవి, పెండ ఉదయ్,తదితరులు పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళఏారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు వర్ధంతిని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం జీవన్, ముస్కు మోహన్, గడ్డం లింగారెడ్డి, రాజారం సహదేవ్, దండెవోయిన కార్యకర్తలు పాల్గొన్నారు. ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ చందరవి, దేవగౌడ్, తిరుపతిరెడ్డి, నర్సారెడ్డి, గంగాధర్, రాజేందర్,రాజేశ్వర్,లక్ష్మణ్,తదితరు లు పాల్గొన్నారు. డొంకేశ్వర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తనదైన పాలనతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు అన్నారు.ఈ కార్యక్రమంలో భరత్ రెడ్డి, బాబురావు, సుమన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలి



నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బోధన్,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం బోధన్ ఎమ్మెల్యే పసుపు వాగును పరిశీలించారు. గణేష్ నిమజ్జన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్, మాజీ కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, దాము, మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అమ్దాపూర్ గ్రామస్థులు

బోధన్,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామ రైతులు మంగళవారం ఉదయం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్షాలకు బెల్లాల్ చెరువు బ్యాక్ వాటర్ రావడం వల్ల సంగం, గోవూరు శివారులోని పొలాలు నీట మునిగి 400ఎకరాల పంట నష్టం జరిగిందని పంట నష్టపోయిన రైతాంగానికి ఆదుకోవాలని కోరారు. బెల్లాల్ చెరువు బ్యాక్ వాటర్ వలన పొలాలు మునగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ కార్యక్రమంలో అమ్దాపూర్ గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందే ఫ్యాక్టరీ హామీని నిలబెట్టుకోవాలి

బోధన్,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందే ఫ్యాక్టరీ హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బోధన్ యువత డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అడ్లూరి శ్రీనివాస్, బోధన్ యువత సభ్యులు గంధం రాజేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

హత్యకేసులో ముగ్గురికి జీవితఖైదు

నిజామాబాద్‌లీగల్, 2(ఆంధ్రజ్యోతి):రాష్ట్రవ్యాప్తంగా పలు హత్యలు చేసిన వారిలో మాక్లూర్ వాసులను మరో రెండు హత్య కేసులలో కలపి ముగ్గురికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి మంగళవారం తీర్పు వెలువరించారు. పిపి రాజేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు జిల్లాలోని మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రసాద్ సాన్వికలను మెడిద ప్రశాంత్, గుగులోత్ విష్ణు, మెడిద ఒడ్డమ్మలతో కలసి వేరువేరు ప్రదేశాలలో హత్యచేసి చేసినట్లు నిర్ధారిస్తూ శిక్షలను ఖరారు చేశారు. మొదట మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదనపల్లి గ్రామఅటవీ ప్రాంతంలో 29 నవంబరు, 2023న ప్రసాద్‌ను ప్రశాంత్ బండరాయితో తలపై బలంగా కొట్టగా, విష్ణు కట్టెతో, వంశీ బీరు సీసాతో కొట్టి గాయపరచి హత్య చేసి భూమిలో పాతిపెట్టారు. నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రసాద్ భార్య సాన్విక ను కారులో తీసుకువెళ్లి కారులోనే వంశీ సాన్వికపైదాడి చేయగా, విష్ణు తాడుతో మెడ చుట్టు ఉరి వేసి 1 డిసెంబరు, 2023న హత్య చేశారు.రెండు హత్యలకు ఒడ్డెమ్మ సహకరించారు. పై నేరారోపణలు కోర్టు నేర న్యాయ విచారణలో రుజువు కావడంతో ప్రశాంత్, విష్ణు, ఒడ్డెమ్మ లకు హత్య నేరంమరి పలు నేరాలకు గాను జీవితఖైదు, విధించారు. శిక్షలన్నీ ఏకకాలంలో అనుభవించాలని సెషన్స్ జడ్జి భరతలక్ష్మీ తమ తీర్పులో పేర్కొన్నారు. వంశీ బాలుడు అయినందున అతని కేసు బాలల న్యాయ మండలిలో విచారణలో ఉన్నది

చెరువులో పడి ఒకరి మృతి

మోపాల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన పోశెట్టి (55) మత్స్యకారుడు చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తుగా మాసాని చెరువులో పడి మృతి చెందినట్లు మోపాల్ పోలీసులు తెలిపారు. చేపలు పట్టడానికి వెళ్లిన పోశెట్టి తిరిగి రాకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన గురయ్యారు. పోశెట్టి మృతదేహం మంగళవారం ఉదయం చెరువులో తేలినట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

బీర్కూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని గోసంగి సంఘంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 13 మంది పేకాట ఆడుతున్న వారిని పట్టుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ. 8,100 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కోటగిరి,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాది గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. పేకాట స్థావరంలో 1120రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యుడి అరెస్టు

కామారెడ్డిటౌన్,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):అంతరాష్ట్రదొంగల ముఠా సభ్యుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. సదాశివనగర్ మండలంలోని మర్కల్ గ్రామంలో ఓ ఇంట్లో జూలై 19లో రెండు తులాల బంగారుచైన్, రూ.25 వేల నగదు, అదేగ్రామానికి చెందిన గుర్రపు మహేష్ కిరాణదుకాణంలో రూ.12 వేలనగదు, రెండు తులాల పుస్తెలతాడు, మూడు జతల వెండి పట్టగొలుసులు దొంగలించబడినట్లు తెలిపారు. రెండు కేసులు నమోదుచేసుకుని విచారణ ప్రారంభించగా మంగళవారం కల్వరాల స్టేజ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను గమనించి ఓ వ్యక్తి తన కారును వెనక్కి తిప్పుకుని పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి పట్టుకుని విచారించగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సికిందర్ సోన్లాల్ దర్బార్‌గా పేర్కొన్నాడని తెలిపారు. 9 మంది వ్యక్తులుకలిసి ముఠాగాఏర్పడి జిల్లా పరిధిలో దొంగతనాలకు పాల్పడినాడని తిరిగి మరలా దొంగతనాలు చేయడానికి అనుకులంగా ఉండే స్థలాలో రెక్కి నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కారును కొనుగోలుచేసి దొంగతనాలకు ఉపయోగిస్తున్నట్లు తె లిపారు. నేరాలు చేసే సమయంలో ఎవరైన అడ్డుపడితే కత్తులు,రాడ్లు చూపిస్తు భయభ్రాంతులకు గురిచేసి అవసరమైతే ప్రాణాలకు హాని చేసి దొంగతనాలు చేస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నారని తెలిపారు. సికిందర్ వద్ద కారు,ఫోన్,కత్తి,టార్చ్‌లైట్, కట్టింగ్ ప్లేయర్, రూ.2600 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఒకరికి పదేళ్ల జైలు శిక్ష

ఏర్గట్ల/నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన జంగం రాజశేఖర్‌కు అనే వ్యక్తి అత్యాచారం చేసిన కేసులో కోర్టు పదేళ్ళ జైలు శిక్ష విధించినట్లు ఏర్గట్ల ఎస్సై పడాల రాజేశ్వర్ తెలిపారు. జంగం రాజశేఖర్ గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన యువతికి మాయా మాటలు చెప్పి, పెళ్ళి చేసుకుంటానని నమ్మించి ఆమెపై అత్యాచారం చేయడంతో అతనిపై టీజింగ్, అత్యాచారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరళించగా మంగళవారం నాలుగవ అధనపు మెజిస్ట్రేట్ నిజామాబాద్ జంగం రాజశేఖర్‌ను దోషిగా నిర్ధారించి 10 సంవత్సరాల కఠిన కారాగా శిక్ష విధిస్తూ తీర్పు ఇవ్వగా, బాధిత యువతికి బాధిత పరిహార పథకాల కింద అత్యాచార బాధితురాలికి 5 లక్షలు కోర్టు ద్వారా అందినట్లు ఎస్సై పడాల రాజేశ్వర్ తెలిపారు. ఈ కేసులో పనితీరు కనబరిచిన పోలీస్ సిబ్బందికి జిల్లా పోలీస్ కమీషనర్ అభినందినలు తెలిపారన్నారు.

వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ అంతర్రాష్ట్ర దొంగ

● రాజస్థాన్ నెంబర్ ప్లేట్ వాహనంతో జిల్లాలో దొంగతనాలు

సదాశివనగర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి నెంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న కారును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ తన కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సికిందర్ సోన్లాల్ దర్బార్ అతడి స్నేహితులు సంజు, విశాల్, అభిషేక్, ఫ్యూస్, అనీల్, ఉమేష్ బాయ్, గోవింద బాయ్‌తో కలిసి ఒక ముఠాగా ఏర్పడి కామారెడ్డి పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. సదాశివనగర్ మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన గెండ్రెడ్డి గంగాధర్ తన అత్తగారు పనినిమిత్తం హైదరాబాద్ వెళ్లగా జూలై 19న ఉదయం ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో బీరువాలోని రెండు తులాల బంగారు చైను, రూ.25వేలను, అదే గ్రామానాకి చెందిన గుర్రపు మహేష్‌కు చెందిన కిరాణ దుకాణంలో కౌంటర్ నుండి రూ.25వేలు, ఇంటిలో రెండు తులాల పుస్తెల తాడు, మూడు జతల వెండి పట్టగొలుసులను గుర్తుతెలియని దొంగలు దొంగిలించారు. ఈ మేరకు సదాశివనగర్ పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా విచార ణ ప్రారంభించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సీసీ కెమెరాల ద్వారా అనుమానిత వ్యక్తుల కదలికలను పరిశీలిస్తున్నామన్నారు. కాగా కల్వరాల్ స్టేజ్ వద్ద మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పోలీసులను గమనించి ఒక వ్యక్తి పారిపోతుండగా తమ సిబ్బంది పట్టుకుని విచారించగా తన పేరు సికిందర్ సోన్లాల్ దర్బార్ అని తాము దొంగతనాలు చేశామని, తిరిగి మరల దొంగతనాలు చేయడానికి రెక్కి నిర్వహిస్తున్నామని ఒప్పుకున్నాడని తెలిపారు. వీరంతా దొంతనాలు చేస్తూ ఎవరైనా అడ్డుకుంటే భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రాణాలకు సైతం హాని చేసి దొంగతనాలు చేస్తారని అన్నారు. ఈ మేరకు సికిందర్ వద్ద నుండి ఫోన్, ఎర్టిగా కారు, కత్తి, టార్చ్‌లైట్, కట్టింగ్ ప్లేయర్, రూ.2600లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగితా వారిని సైతం త్వరలోనే పట్టుకుంటామన్నారు. సికిందర్‌ను చాకచక్యంగా పట్టుకున్న సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సదాశివనగర్ సీఐ సంతోష్, ఎస్సై పుష్పరాజ్, సీసీఎస్ సిబ్బంది ఉస్మాన్‌ను ఎస్పీ అభినందించారు.



కేసు వివరాలనువెల్లడిస్తున్న ఎస్పీ

వాహనాల తనిఖీ

రెంజల్,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందర మంగళవారం ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాల తనికీ నిర్వహించారు. వాహనదారులు సరైన పత్రాలతో వాహనాలు నడపాలని సూచించారు. గుర్తింపు పత్రాలు లేని వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమాన విధించారు. ఆయన వెంట సెకండ్ ఎస్ఐ రాజు, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, ఆసిఫ్, బస్వంత్ రావు తదితరులున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

దర్పల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):దర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు ఎస్సై కళ్యాణి తెలిపారు. డీబీతాండాకు చెందిన గుగులోత్ సుభాష్‌కు 4 రోజుల జైలు శిక్ష, దర్పల్లికి చెందిన సత్యనారాయణకు 2 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. వీరిద్దరిని జైలుకు తరలించామని ఆమె చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు.

నవీపేట,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): నవీపేట మండల కేంద్రంలో ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలుశిక్ష పడిందని ఎస్ఐ తిరుపతి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఖురేషి చాంద్‌పాషా వరుసగా రెండుసార్లు మద్యం సేవించి పట్టుబడగా అతనికి ఆరు రోజులతో పాటు మరో రెండు రోజులు కలిపి శిక్ష పడిందని, అలాగే రెంజల్ మండలం దండిగుట్టకు చెందిన వీ.రాజుకు రెండు రోజుల జైలుశిక్ష పడిందని ఎస్ఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్ట రీత్యా నేరమని ఎస్ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి):నగరంలోని అమ్మ వెంచర్ కొత్త బ్రిడ్జి వద్ద వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు 4వ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వ్యక్తి వయస్సు సుమారు 28-30 ఉంటుందని తెలిపారు. ఒంటిపై బ్రౌన్ కలర్ టీషర్ట్, ఎరుపు రంగు బనియన్, జీన్స్‌పాంట్ ధరించాడని తెలిపారు. కుడిచేతి పైన మీనాక్షి అని ఇంగ్లీష్‌లో పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే 4వ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. వివరాల కోసం 8712659840 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కాలువలో పడి వృద్ధురాలి మృతి

రుద్రూరు,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలువలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన రుద్రూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సాయన్న తెలిపిన వివరాల ప్రకారం రుద్రూర్ గ్రామానికి చెందిన గైని సరవ్వ(80) గ్రామంలో నూతనంగా నిర్మాణ పనులు చేపడుతున్న బ్రిడ్జి వద్ద వేకువ జామున ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు బిక్షాటన చేస్తూ జీవనం కొనసాగించేదన్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోస్రాలో మండల స్థాయి 'తొలి మెట్టు'

మోస్రా,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల మోస్రాలో తొలి మెట్టు కార్యక్రమం మండల అభివృద్ధి అధికారి నాగనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తమ పాఠశాల నుంచి బోధన అభ్యసన ఉపకరణాలను ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సాయిలు, న్యాయ నిర్ణేతలుగా చందూర్ పాఠశాల భారతి, మన్‌పూర్ పాఠశాల శివ శేఖర్, మండల పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి సి.ఎస్ విజయభాస్కర్, తపస్ మండల అధ్యక్షుడు జి.మోహన్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, హెచ్ఎం,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామం.. హున్సలో వైద్య శిబిరం

సాలూర,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): వరద ముంపునకు గురైన హున్స గ్రామంలో సాలూర మండల వైద్య అధికారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గత నాలుగు రోజుల నుంచి ముంపు గ్రామాలలో వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ రాజ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌ఓసీ అందజేత

రుద్రూరు,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ గ్రామానికి చెందిన అప్పన్న మెకాల మార్పిడి శాస్త్ర చికిత్స కొరకు ఎల్ఓసీకి దరఖాస్తు చేసుకోగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా రూ.80వేల ఎల్ఓసీ మంజూరు కావడంతో మంగళవారం కాంగ్రెస్ నాయకులు బాధితుడు అప్పన్నకు ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, మాజీ జడ్పీటీసీ నారోజి గంగారాం, నాయకులు పత్తి రాము, అక్కపల్లి నాగేందర్, పార్వతి ప్రవీన్ పాల్గొన్నారు

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

ఎడపల్లి,సెప్టెంబరు2(ఆంధ్ర జ్యోతి):ఎడపల్లి మండలంలోని దుబ్బ తండా గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం రాజస్థాన్ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాల వివరాలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో నేర్పిస్తున్న విషయాలను, గ్రామంలో ఉన్న ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సౌకర్యాలు కల్పిస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి రసూల్ బీ మాట్లాడుతూ దేశంలో ఆరోగ్యవంతమైన గ్రామ పంచాయితీలను ఎంచుకోవడం జిరిగిందని, అందులో నిజామాబాద్ జిల్లాలో 8 గ్రామ పంచాయితీలను ఎన్నుకోవడం జరిగిందని, అందులో భాగంగా దుబ్బతాండ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని రాజస్థాన్ బృందం పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ డిప్యూటి డైరెక్టర్ ఓంప్రకాష్, సీడీపిఓ రావత్ రాం, బోధన్ సీడీపీఓ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు, కార్యదర్శి ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కమ్మర్‌పల్లి,సెప్టెంబరు2: (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు జరుపుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మొదటివిడత బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమకావంతో మంగళవారం హసాకొత్తూర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి. బాల్కొండ నియోజికవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఉన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీన్, గ్రామ కాగ్రెస్ అధ్యక్షుడు రేవతి గంగాధర్, ఇందిరమ్మ కమిటీసభ్యులు లింగారెడ్డి కుందేటి శ్రీనివాస్, ఏనగు మనోహర్, మోదిని శ్రీధర్, మంద భాగ్యలలిత, కార్యకర్తలు పాలొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

బోధన్,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హంగర్గ, కందకుర్తి, నీలా తదితర గ్రామాలలోని నిరుపేద కుటుంబాల ప్రజలకు మంగళవారం తన సొంత ఖర్చులతో ఎంఐఎం పట్టణ అధ్యక్షులు మీర్ ఇలియాజ్ అలీ 300మంది కుటుంబాలకు కుల, మతాలకు అతీతంగా నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు ఎండీ అబ్దుల్ సమీ, హాజీ బిల్డర్, అబీద్ ఫారూఖీ, అబ్దుల్ రషీద్, కలీంలతో ఎంఐఎం యువత తదితరులు పాల్గొన్నారు.

నేడు నవీపేట మండలంలో ఎమ్మెల్యే పర్యటన

నవీపేట,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బుధవారం నవీపేట మండలంలో పర్యటించనున్నారని తహసీల్దార్ వెంకట రమణ తెలిపారు. ఉదయం 9గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే ఇటీవల నూతనంగా మంజూరైన ఫుడ్ సెక్యూరిటీ కార్డులను సైతం లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భీమ్‌గల్ , సెప్టెంబరు, 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పురానిపేట్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్త గోపాల్‌ను, పల్లికొండ గ్రామంలో బీజేపీ కార్యకర్త ముద్దుల ప్రశాంత్ నాన్న ఇటీవల మృతి చెందడంతో మంగళవారం బీజేపీ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘానికి రూ.3 లక్షల నిధులు



పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల,సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):మం డలకేంద్రంలోని కురాకుల ముదిరాజ్ సం ఘానికి అదనపు పను ల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.3 లక్ష లు నిధులు మంజూరీ కాగా మంగళవారం సంఘం అధ్యక్షుడు కురాకుల భూమేష్, కాంగ్రెస్ నాయకులు పనులు ప్రారంభించారు. నిధుల మంజూరీ చేయించిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకు మార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్, బద్దం లింగారెడ్డి, రాజారం సహదేవ్, ఓర్సు రాములు, దండెవోయిన సాయికుమార్, మేకల సాయన్న తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

సిరికొండ, సెప్టెంబరు, 2(ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలంలోని కొండూర్, వాడి గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులకు మంగళవారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బియ్యం పంపిణీ చేశారు. సుమారు 50 క్వింటాళ్ల బియ్యాన్ని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్ మాట్లాడుతూ ఎలాంటి విపత్కర పరిస్థితులోనైనా తాము ఆదుకునేందుకు ముందుంటామని అంకాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, సిరికొండ మండల పార్టీ అధ్యక్షుడు రవి, అంకాపూర్ కాంగ్రెస్ నాయకులు ఎంసీ గంగారెడ్డి, అమృత్‌రావు, సల్లా నర్సారెడ్డి, మల్లేష్,పాల్గొన్నారు.

17 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

వేల్పూర్, సెప్టెంబరు, 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీ నుంచి మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో రేణుక, ప్రధానోపాధ్యాయురాలు రాజన్న, బాజన్నలు తెలిపారు.మంగళవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో మండల స్థాయి పాఠశాలల పోటీల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ పోటీలలో జూనియర్, సబ్ జూనియర్ బాలురు, బాలికలు వేరు వేరు విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. ఈ క్రీడా పోటీలలో కబడ్డీ, ఖోఖో వంటి క్రీడలు నిర్వహించడం జరుగుతు ందని మండల క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. రాజేందర్ తెలిపారు.

ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ

కోటగిరి/ఆలూరు/ఆర్మూర్,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం నవ భారత్ సాక్షరత కార్యక్రమం ఉల్లాస్‌లో భాగంగా మంగళవారం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శంకర్ మాట్లాడుతూ 15సంవత్సరాలు పైబడిన స్వయం సహాయక బృందాల్లోని సభ్యుల్లో మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం గ్రామస్థాయిలో వాలంటీర్ టీచర్లను నియమిస్తున్నామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుండి ఒక ఉపాధ్యాయుడు ఒక వీవోను శిక్షణకు పిలిచి ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతి పది మంది నిరక్షరాస్యులు ఒక సామాజిక చైతన్య కేంద్రంగా విద్యబోధనలు అందించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అలివేణి, ఆర్‌పీలు మహజన్ నర్సింలు, కృష్ణ మోహన్, రాజేష్, బర్ల సాయిలు, ఉదయ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.ఆలూర్‌లో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో విద్యాశాఖ అధికారి నరేందర్ సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్ హాజరై మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు రాయడం నేర్చుకోవా లని అందరు కూడా జ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి ఉపాధ్యాయులు, వివోఏలు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరికి చదువు వచ్చేలా అందరు కృషి చేసి ఆర్మూర్ మండలాన్ని వందశాతం అక్షరాస్యత సాధించే విదంగా తోడ్పాటునందించాలని ఎంపీడీవో శివాజీ అన్నారు. ఆర్మూర్‌లోని ఎంఆర్‌సీలో మంగళవారం నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో పనిచేసే వివోఏ, సీసీ లకు సంబందిత హాబిటేషన్‌లోని ఒక ఉపాధ్యాయునికి శిక్షణ కార్యక్ర మం నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం,ఏపీఎం భూమేశ్వర్ గౌడ్, ఆర్‌పీలు బాలరాజు, లక్ష్మీనారాయణ,పాల్గొన్నారు.



లింగంపల్లి(ఖుర్దు) వద్ద ప్రమాదకరంగా మారిన వంతెన

ప్రమాదపు అంచున పాముల వాగు బ్రిడ్జి

లింగంపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకు పోయిన పాముల వాగు తాత్కాలిక వంతెన పనుల్లో నాణ్యత లేకపోవడంతో చిన్న పాటి వర్షానికే వర్షానికే మట్టి కొట్టుకుపోవడంతో మరింత ప్రమాదంగా మారిందని మండల ప్రజలు అంటున్నారు. ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధానరహదారిపైఉన్న వంతెన కొట్టు కుపోయి వారం రోజులు కావస్తున్న రాకపోకలకు ఇబ్బంది గా మారడంతో మండలానికి రావల్సిన నిత్యవసర సరుకు లు రావడం లేదని దీంతో ధరలు పెరిగిపోతున్నా యని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సులు రాక వారం రోజులు అవుతుం దని బ్రిడ్జీ కూలిపోయినా స్థానంతో పాముల వాగు వరద ను తట్టుకునేలా కొన్ని పైపులు వేసి మట్టి పోస్తే కొంత వరకు వరదను తట్టుకునేదని వారు అంటున్నారు. పైపులు వేయకుండా మట్టి పోయడంతో వర్షం పడగానే వరద దాటికి మట్టి కొట్టుకుపోతుందని దానికి తోడు ఉన్న కొద్దిపాటి బ్రిడ్జీ సైతం కిందినుంచి పగు ళ్లు వచ్చాయని భారి వాహనాలు వంతెనపై నుంచి వెళ్లితే ఏక్షణమైనా వంతెనకూలిపోయే ప్రమాదం ఉందని వారు అంటున్నారు. అంత ప్రమాదకర పరిస్థితిలోను కొందరు భారి వాహనా లతో వచ్చి బ్రిడ్జీపై మట్టిలో దిగబడి ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు కలుగ జేస్తున్నారని మండల ప్రజలు అంటున్నారు. మంగళవారం బ్రిడ్జీపై లారి దిగబడ డంతో ఇతర ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండ వలసి వచ్చింది.భారీవాహనాలు రాకుండా పోలీసలు అక్కడ కాపలా ఉండి భారి వాహనాలను రాకుండా అడ్డు కోవాలని వారు కోరుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి వంతెనపనులను మరింత నాణ్యత గా చేపట్టి మండల ప్రజలకు ఆర్టీసీ బస్సులు వచ్చేలా బ్రిడ్జీ నిమరమ్మతు చేయాలనిమండల ప్రజలు కోరుతున్నారు.

నిజాంసాగర్ ప్రాజెక్టులో లో లెవెల్ నీటిమట్టం

నిజాంసాగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల దృష్ట్యా నిజాంసాగర్ ప్రాజెక్టులో లో లెవెల్ నీటిమట్టం ప్రాజెక్టులో నిలువ చేస్తూ ఉన్నారు ఈనెల రెండో తేదీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రాజెక్టు పూర్తి నీటిమట్టాన్ని నిలవ చేయ లేకపోతున్నారు. ఎగువ నుంచి వస్తున్న 76,831 క్యూ సెక్కుల గాను ప్రాజెక్టు 14 వరద గేట్లను ఎత్తి మం జీరా దిగువకు 97 వేల 070 క్యూసెక్కుల నీటిని విడు దల చేస్తున్నారు. నిజాంసాగర్ లోనికి క్రమేపిన వరద నీరు మంజీరా వెంటవస్తూ ఉండడంతో అధికారు లు అప్రమత్తం అయ్యారు. మంజీరా వెంట ఏసమ యం లోనైనాభారీవరద నీరు వచ్చే అవకాశం ఉ న్నం దున అధికారులు ప్రాజెక్టు నీటిమట్టం లోలెవెల్ ఉం చుతూ ఎగువ నుంచి వచ్చే వరద నీటిని మంజీరా లోనికి వదులుతున్నారు.ప్రాజెక్టులో పూర్తి నీటిమట్టం ఉంచి నట్లయితే ఒకేసారి వచ్చే వచ్చే వరదనీటిని తట్టుకో వడంకష్టతరం కానుంది.దీంతో ముం దస్తుగా ప్రాజెక్టు నీటిమట్టాన్నిలో లెవల్ స్థాయిలోని ఉంచుతున్నారు. నీటిపారుదల శాఖ అధికా రులు ప్రాజెక్టులోనికి వచ్చే వరద నీటితో పాటు ప్రాజెక్టు నీటి మట్టాన్ని ఎప్పటి కప్పుడు అంచనా వేస్తూ ఇంజి నీరింగ్ అధికారులతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సమీక్ష జరుపుతున్నారు. ఎప్పటి కప్పుడు జిల్లా నీటిపా రుదల చీఫ్ ఇంజనీర్ సర్కిల్ 2సూపరిండెంట్ ఇంజనీర్ తెలుసుకుంటున్నారు. నిజాంసాగర్ప్రాజెక్టులోకి లేని విధంగా నీరు వస్తూ ఉండడంతో అధికారులు అ ప్రమత్తంగా ఉంటున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేసి ఇప్పటికి 104 సంవత్స రాలు పూర్తయింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంతోనే నిజా మాబాద్ జిల్లాకు ధాన్యాగారంగా కీర్తి పొందింది.



ప్రాజెక్టు నీటి నిలువల సూచిక


కొనసాగుతున్న ప్రాజెక్టు వరద గేట్లు

» కొనసాగుతున్న 14 వరద గేట్లు » 97,070 క్యూసెక్కుల వరద
» ప్రస్తుతం ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు 13.100 టీఎంసీల సామర్థ్యం

ఐఎంబీఏ 2,4 సెమిస్టర్ పరీక్షల టైంటెబుల్ విడుదల

డిచ్‌పల్లి,సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని ఐఎంబీఏ 2, 4వ సెమిస్టర్ రెగ్యూలర్ థియరీ పరీక్ష టైంటేబుల్ విడుదల చేసి నట్లు పరీక్షల నియంత్రణ అధికారి సంప త్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 4 నుంచి పరీక్షలు ప్రారంభమ వుతాయని ఆయన తెలిపారు. 2వ సెమి స్టర్ పరీక్షలు ఉదయం 11 నుంచి 1గంట వరకు, 4వ సెమిస్టర్ పరీక్షలు మధ్యా హ్నం 2 నుంచి 4గంటల వరకు జరుగు తాయని అన్నారు.

● కొనసాగుతున్న పరీక్షలు..

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ, బీఎడ్, బీపీఈడీ, ఎంఎడ్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళ వారం జరిగిన పీజీ 2, 4 సెమిస్టర్ పరీక్ష లకు 945 మందికి 902 మంది హాజరు కాగా 41 మంది గైర్హాజరయ్యారు. బీఈడీ, బీపీఈడీ 2, 4 సెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్ లాగ్ పరీక్షలకు 1455 మందికి గాను 1387 మంది హాజరుకాగా 68 మంది గైర్హా జరయ్యారు. ఎంఈడీ 4వ సెమిస్టర్ రెగ్యూ లర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు మొత్తం 32 మందికి గాను 30 మంది హాజరుకాగా 2 విద్యార్థులు గైర్హాజరయ్యారు.

చదువుతో పాటు ఇతర కళల్లో ప్రావీణ్యం పొందాలి


విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందిస్తున్న డీఈవో రాజు

కామారెడ్డిటౌన్,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు ఇతర కళల్లో విద్యార్థులు ప్రావీణ్యం పొందాలని డీఈవో రాజు తెలిపారు. మంగళ వారం శాంతినికేతన్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ పోటీలలో వ్యక్తిగత గాత్ర సంగీతంలో బీబీపేట ఉన్నత పాఠశాలకు చెందిన అఖిల్ ప్రథమ, గాంధారి ఉన్నత పాఠశాలకు చెందిన నిస్సి ద్వితీయ స్థానం,గ్రూప్ గాత్ర సంగీతంలో చిన్నమల్లారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, గాంధారి పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, వాద్యపరికరాల సంగీత పోటిలలో మద్నూర్ గురుకుల పాఠశాల విద్యార్థి చంద్రశేఖర్ ప్రథమ, గిద్ద ఉన్నత పాఠశాల విద్యార్థి వంశీ ద్వితీయ,శాస్త్రీయ నృత్యం సోలో పోటిలలో బీబీపేట ఉన్నత పాఠశాలకు చెందిన పూర్ణచందన ప్రథమ, దేవునిపల్లి పాఠశాలకు చెందిన హస్నిక ద్వితీయ,బృందనాట్య పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్వరాల్ ప్రథమ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇసా యిపేట ద్వితీయ, థియేటర్ ఆర్ట్స్‌లో కల్వరాల విద్యార్థిని ప్రథమ, దేవునిపల్లి విద్యార్థులు ద్వితీ య, విజువల్స్ ఆర్ట్స్ సోలో పోటిలో మద్నూర్ గురుకుల పాఠశాల విద్యార్థి బాలజీప్రతమ, తాడ్వాయి గురుకుల పాఠశాల విద్యార్థిని జెస్సీకా ద్వితీయ బహుమతులను గెలుచుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా అకాడమిక్ మానటరింగ్ అధికారి వేణుగోపాల్, న్యాయ నిర్ణేతలు విష్ణువర్ధన్, మనోహర్,సాయిరెడ్డి, దేవిప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

టీయూలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం



శ్రమదానంలో పాల్గొన్న వాలంటీర్లు

డిచ్‌పల్లి,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయంలో మం గళవారం ఎన్ఎస్ఎస్1, 4 ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.స్రవంతి, స్వప్నల ఆధ్వర్యంలో లా కళాశాల వద్ద ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చెత్తను ఊడ్చి శ్రమదానం చేశారు.అనంతరం మొ క్కలు నాటారు.ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, లా కళాశాల ప్రిన్సిపల్ ప్రసన్న,ఎల్లోసా,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి శిథిలాల తొలగింపు



శిథిలాలను తొలగిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిరూరల్,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):ఎల్లారెడ్డి మండల పరిధి లోని కళ్యాణి గ్రామంలో ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షా లకు గ్రామ ప్రధాన రహదారిపై కూలి పోయిన ఇంటి శిథిలాలు స్థాని కులకు అడ్డంకిగా మారాయి.దీనిపై సోమ వారం ఆంధ్రజ్యోతి పత్రిక లో వెలువడిన కథనానికి మంగళవారం గ్రామపంచా యతీ సిబ్బంది స్పందించా రు.ఎక్స్‌కవేటర్ సహయంతో ఇంటి శిథిలాలు, మట్టిని తొలగించారు. ప్రధాన రహదారిపై ఏర్పడిన సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇంటి యాజమాని అందుబాటులో లేకపోవడంతో కొంత అంతరాయం ఏర్పడిందని గ్రామపంచాయతీ కార్య దర్శి సుధారాణి అన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన పరిష్కరించడానికి కృషిచేస్తా మన్నారు.

ఎంతటివారైన పార్టీ గీతదాటి పనిచేస్తే చర్యలు తప్పవు

» ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌ను స్వాగతిస్తున్నాం : గంపగోవర్ధన్


కామారెడ్డిలో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌నాయకులు

కామారెడ్డిటౌన్,సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ పార్టీ గీతదాటి పని చేస్తే ఎంతటివారైన చర్యలు తప్పవని మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్సీ కవిత సస్పెండ్‌ను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఎవరైన పార్టీ కట్టుబాట్లకు లోబడి పనిచేయాలని కొంతకాలంగా కవిత పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న కార్యకలపాలకు ఆమెనుపార్టీ నుంచి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపా రు. పార్టీలో ఎంతపెద్దవారైన, కుటుంబసభ్యులైన క్రమశిక్షణ తప్పితే చర్యలు ఉంటాయని పార్టీ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారని తెలిపారు. కార్య కర్తలే పార్టీకి ముఖ్యమని భావించి వ్యతిరేకంగా పనిచేసే కేసీఆర్ కూతురు కవితను పార్టీనుంచి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు.అంతకముందు కాళేశ్వ రం ప్రాజెక్ట్‌పైన రాష్ట్రప్రభుత్వం కుట్రలు చేస్తుందని పేర్కొంటూ నియో జక వర్గ నాయకులతో కలిసి కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌర స్తాలో నిరసన తెలిపారు..ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజి బొద్దిన్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి,మాజీ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ రవియాదవ్,నాయకులు లక్ష్మీనారాయణ,భాను, మాజీద్ పాల్గొన్నారు.

కేసీఆర్‌పై బురద చల్లడానికి కాళేశ్వరంపై సీబీఐ

● జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే

మద్నూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌ను అప్రతిష్ట పాలు చేయడానికి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తూ కాళేశ్వరంపై సిబిఐ దర్యాప్తు అంటున్నారని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే ఆరోపించారు. మండల కేంద్రం లోని పాత బస్టాండ్ వద్ద రాస్తారోకో నిరసన కార్యక్రమంలో నల్ల కండువాలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రధాన సమస్య వరదల గురించి రైతులకు అందించే నష్టపరిహారం గురించి మాట్లాడకుండా కాలేశ్వరం పైనే చర్చించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 2023లో కాళేశ్వరం ప్రాజెక్టు రెండు, మూడు, పిల్లర్ల వద్ద బాంబు పేలి ఏడవ బ్లాకు కుంగిపో యిందని దానిపై సిబిఐతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బస్సీ పటేల్, మాజీ సర్పంచ్‌లు ధరస్ సురేష్, గఫ్ఫార్, సింగిల్ విండో చైర్మన్ విజయ్, నాయకులు రౌతువార్ నాగేష్, గోవింద్, కాశీనాథ్ పటేల్, కంచెన్ హన్మాండ్లు, తదితరులు ఉన్నారు.


మద్నూర్‌లో మాట్లాడుతున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే

అరకొర యూరియాపై రైతుల ఆగ్రహం


ఫరీద్‌పేట్‌లో యూరియా కోసం తరలివచ్చిన రైతులు


యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

» భారీగా తరలివచ్చిన రైతులు
» డీఏవో సర్దిచెప్పిన వినని రైతులు
» మిన్నకుండిపోయిన పోలీసులు
» యూరియా పంపిణీ వాయిదా వేసిన అధికారులు

పాల్వంచ,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): పంటలకు కావాల్సిన ఎరు వుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యూరియా లోడ్ వచ్చిందన్న ఆశతో వరుసలో నిలబడిన యూరిమా దొరుకు తుంద న్న నమ్మకంలేకుండా పోయింది.మంగళవారం మాచారెడ్డి సొసైటీ పరిధిలోని పాల్వంచ మండలం ఫరిద్‌పేట్‌లో యూరియా పంపిణీకి అధికారులు ఏర్పాటుచేశారు.సమీప గ్రామాలైన పాల్వం చ, ఫరిద్ పేట్, వాడి, బీఆర్ పల్లి, వెల్పుగొండ నుండి రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.సుమారు 440బస్తాల యూరియారాగా రైతులు 1200 మందికి పైగా రైతులు రావడంతో పంపిణీ చేయడం ఇబ్బందిగా మారింది.అరకొరయూరియాపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

● వ్యవసాయాధికారులు సర్దిచెప్పిన వినని రైతులు..

రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయాధి కారి మోహన్‌రెడ్డి, ఏడీఏ అపర్ణ ఫరిద్‌పేట్‌కు చేరుకుని రైతులను శాంతింపజేసే ప్రయత్నం చేసినా వారు వినలేదు. రోజుల తరబడి యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నామని, వరుసలో నిల బడిన దొరకడం గ్యారెంటీ లేదని ఎప్పుడు అందరికి సరిపడా యూ రియా అందిస్తారని రైతులు అధికారులను నిలదీశారు. ఫరీద్‌పేట్ రైతువేదికలో అధికారులు చర్చించుకుని యూరియా ఇవ్వడం ఇప్పుడు సాధ్యం కాదని అందరికి అందని యెడల పరిస్థితి చేయి దాటిపోతుందని యూరియా పంపిణీ కార్యక్రమం వాయిదా వేశారు.

● మిన్నకుండిపోయిన పోలీసులు

ఫరీద్‌పేట్‌లో యూరియా పంపిణీలో గోడవలు కాకుండా మాచా రెడ్డి ఎస్సై అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిమిత్తం రాగా రైతులలో నెలకొన్న ఆగ్రహంతో పోలీసులు మిన్నకుండి పోయారు. రైతులను వరుసక్రమంలో ఉంచడానికి పోలీసులు ప్రయ త్నాలు చేసిన ఎంతకీ రైతులు వినకపోవడంతో సున్నితమైన అంశం కావడంతో చివరకు యూరియా పంపిణీ వాయిదా పడింది.

నీట మునిగిన పంటల పరిశీలన

రెంజల్,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కు నీట మునిగి నష్టపోయిన పంటలను మంగళవారం ప్రాంతీయ చెరకు మరియు వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సమత పరమే శ్వరి, సాయి చరణ్, రమ్య రాథోడ్‌లు, మండల వ్యవసాయ అధికా రి సిద్ధిరామేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. మండలంలోని బోర్గాం, తా డ్‌బిలోలి, నీలా, కందకుర్తి గ్రామాలలో నీట మునిగిన పంటలను పరిశీలించారు. నీట ముంపుకు గురైన పంటలకు గురైన పంటలను మురుగు నీటిని కాలువల ద్వారా తొలగించి వాటికి 191919 లేదా మల్టికేపెన్ 10గ్రాములు ఒక లీటర్‌కు కలిపి పిచికారి చేయాలని, బ్యాక్టరియా, ఎండు తెగులు సోకిన పంటలకు ప్లాంటమేషన్ లీట రు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. నీరు నిల్వ ఉం డడం వల్ల కాండం కుళ్లు ఆశించిన పొలాలలో టెబుకోనాజోల్ 1మి. లీటరు ప్రొపైకనాజోల్ 1.మి.లీటరును లీటరులో కలిపి పిచికారి చే యాలని సూచించారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్, ఏఈవోలు అజయ్, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు

నవీపేట,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): ఇటీవల తీవ్రంగా కురిసిన వర్షాలకు మండలంలోని నందిగామ, అల్జాపూర్ గ్రామాలలో నీట ముంపుకు గురైన దెబ్బతిన్న పంటలను మంగళవారం అధికారులు పరిశీలించారు. ప్రాంతీయ చెరకు వరి పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ సమత పరమేశ్వరి, శాస్త్రవేత్తలు సాయి చరణ్, రమ్య రాథో డ్, మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్ కుమార్‌లు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలను కాపాడుకోవడానికి అధి కారులు రైతులకు తగిన సలహాలు, సూచనలు అందజేశారు.


నందిగామలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు


బోర్గాంలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అన్నదాతకు అపార నష్టం

» భారీ వరదలతో కొట్టుకుపోయిన పంటలు » రైతన్నను కోలుకోలేని దెబ్బతీసిన వర్షం
» మండలంలో మొతతం 6,142 ఎకరాల్లో పంట నష్టం » రైతన్నను ప్రభుత్వమే ఆదుకోవాలి


వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

తాడ్వాయి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో కనివిని ఎరుగని రీతిలో వర్షం పడి రైతులకు తీవ్ర దుఃఖాన్ని పంట నష్టాన్ని మిగిల్చింది. ఏ గ్రామంలో ఏ రైతును కదిలించిన కన్నీటి ఘాతలే వినిపిస్తున్నాయి. చేతికొచ్చిన పంట అకాల వర్షంతో కొట్టుకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. భారీ వర్షాలకు గ్రామాల్లోని వాగులు కుంటలు చెరువులు పొంగిపొరలి పంట చేళ్లను తుడిచిపెట్టుకుపోయి బీటలుగా మార్చాయి. వరద ఉధృతి తగ్గిన తర్వాత చూస్తే ఎవరి పొలం ఎక్కడ ఉందో తెలియక రైతన్న అయోమయంలో పడ్డాడు. వరదతో వచ్చి పెట్టిన రాళ్లను ఇసుకమేటలను తొలగించాలంటే చాలా కష్టంతో కూడుకొని ఉంటుందని రైతులు అంటున్నారు. ఎన్నో ఏళ్ల నుండి సాగు చేసి చదును చేసిన భూములు సైతం కొట్టుకపోవడంతో సరిగా పంటలు రావని రైతులు అంటున్నారు. గ్రామాల్లో సుమారు ఎకరానికి 20 నుంచి 25 వేల పెట్టుబడి అవుతుందని అంటున్నారు. అకాల వర్షంతో కన్నీటి గాథలే మిగిల్చాయని రైతులు వాపోతున్నారు. ఏ గ్రామంలో చూసిన ఇదే పరిస్థితి కనబడుతుంది. వ్యవసాయ అధికారులు ప్రతి గ్రామానికి వెళ్లి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. గ్రామాల్లో మొత్తం 6,142 ఎకరాల్లో పంట నష్టం అయిందని తెలిపారు. ఇందులో వరి 1640 ఎకరాలు, మొక్కజొన్న 2861 ఎకరాల్లో, పత్తి 1042 ఎకరాల్లో, సోయాబీన్ 73 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. నష్టపోయిన పంటలకు తక్షణమే నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని నష్టపోయిన రైతులు అంటున్నారు.


వరి పొలంలో వరదకు ఇసుకమేటలు పెట్టిన దృశ్యం

రెండు ఎకరాలలో పొలం వేశాను.

అధిక వర్షాలతో నీరు వాడటం తో వరి మొత్తం కొట్టుకుపోయింది. వరిగేట్లు తెగి పాడైపోయింది. వెంట నే ప్రభుత్వం నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలి. **- గొల్ల రాములు, రైతు, కరడ్‌పల్లి**


మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలి

● కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించి శరవేగంగా పూర్తి చేయించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపల్ పట్టణాలలో డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించిన పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ లతో కలిసి అధికారులతో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్ల అసంపూర్తి పనులు, ఇతర పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే నాటికే సాధ్యమైనంత వరకు పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఒక్కో శాఖ వారీగా పనుల ప్రగతిని కలెక్టర్ సమీక్షిస్తూ అధికారులకు సూచనలు చేశారు. సమీక్షలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, హౌసింగ్ పీడీ పవన్ కుమార్, డీపీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళులు


వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, గంగాధర్‌పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

పేద కుటుంబాలకు వైద్యం, విద్య అందాలని ఆరోగ్యశ్రీ, రీయింబర్స్‌మెంట్‌ను తీసుకొచ్చి పేదల పాలిట వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దేవుడు అయ్యాడని నుడా చైర్మన్ కేశవేణు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్‌గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, రాజేంద్రప్రసాద్, ప్రమోద్, వినయ్, బంటుబలరాం, కొండపాక రాజేష్, ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు

ఓం గణేష్ మండలిలో అన్నప్రసాదం

● పాల్గొన్న కలెక్టర్, పోలీసు కమిషనర్


భక్తులకు ప్రసాదం అందజేస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓం గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయిచైతన్య పాల్గొన్నారు. మొదటగా పూజా అనంతరం కలెక్టర్, సీపీలు అన్నదానంలో పాల్గొన్న భక్తులకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో పెద్ద మొత్తంలో స్నేహ సొసైటీ విద్యార్థులు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, డీసీపీ బస్వారెడ్డి, డీఎంహెచ్‌వో రాజశ్రీ, ఫిషరీస్ ఏడీ ఆంజనేయులు, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, మస్తాన్ అలీ, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు

ఘనంగా కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు


అశోక్‌గౌడ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న న్యాయవాదులు

నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ లీడర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు భైర గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు ఆర్ దయాకర్ గౌడ్, నిజామాబాద్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ సాయిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు భైర గణేష్ మాట్లాడుతూ.. లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో న్యాయవాద వృత్తి పురోగతికి న్యాయవాదుల సమస్యల పరిష్కారం దిశగా మరిన్ని చర్యలు చేపడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల సాయి రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయాకర్ గౌడ్, జిల్లా కార్యదర్శి డోన్ పాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరదల వల్ల దెబ్బతిన్న పంటల పరిశీలన

సిరికొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరదల వల్ల దెబ్బతిన్న పంటలను మంగళవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి నర్సయ్య, ఏఈవోలు శివాణీ, మోహన్, ప్రణతి రైతులతో కలిసి కొండూర్, చిన్నవాల్గోట్, మూషీర్‌నగర్ పంట పొలాలను పరిశీలించారు. వరి పంట 3540 ఎకరాలలో, మొక్కజొన్న పంట 100 ఎకరాలు, సోయ పంట 40 ఎకరాలలో దెబ్బతిన్నట్లు ఏవో నర్సయ్య తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి ఆడబిడ్డ అవుట్..

(5వ పేజీ తరువాయి)

ఇంకా మూడున్నర ఏళ్ల పాటు ఎమ్మెల్సీ పదవికాలం ఉంది. పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేసిన క్రమంలో బీఆర్ఎస్‌లోని కొంత మంది ప్రజాప్రతినిధుల అనుచరులు ఆమెకు వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. కొంత మంది ఆమె అనుచరులు ఆమెకు మద్దతుగా పోస్టులు పెడుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఉన్న ఫ్లెక్సీపై కవిత ఫొటోకు పార్టీ సస్పెండ్ చేసిన నేపథ్యంలో వైట్ పేపర్‌తో ఆమె ఫొటోను కనబడకుండా అతికించడం కొసమెరుపు. నిజామాబాద్‌లోని ఆమె ఇంటి వద్ద సైతం ఎలాంటి సందడి కనిపించలేదు.

క్రమంగా తగ్గిన కవిత

2014 తెలంగాణ ఆవిర్భావం తర్వాత నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలిగా గెలుపొందిన కవిత జిల్లాలో తనదైన శైలిలో పార్టీ పై పట్టును సాధించారు. ఐదేళ్ల పాటు పార్టీని తన కనుసన్నల్లో నడిపించిన కవిత 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత క్రమంగా తన ప్రభావాన్ని కోల్పోయారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఓటమిపాలైంది. అప్పటి నుంచే జిల్లా ప్రజాప్రతినిధులకు, కవితకు మధ్య విబేధాలు వచ్చినట్లు తెలుస్తోంది. తనకు వ్యతిరేకంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులు పనిచేసినట్లు ఆమె సన్నిహితుల వద్ద అప్పట్లో వ్యాఖ్యలు చేసింది. ఆ తర్వాత ఎమ్మెల్సీగా ఉన్న భూపతిరెడ్డి పార్టీ మారడంతో ఆయన ఎమ్మెల్సీని కవితకు ఇచ్చారు. రెండేళ్ల పాటు ఎమ్మెల్సీగా ఉన్న కవిత 2022 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత లిక్కర్ కేసులో ఆమె జైలుకు వెళ్లడం, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం, 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు ఆమె దూరంగా ఉండటం వంటి పరిణామాలు జరిగాయి. గత కొద్దికాలంగా జిల్లా పార్టీ నాయకులతో, ప్రజాప్రతినిధులతో కవిత అంటీ ముట్టనట్లే వ్యవహరిస్తున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఒకటి రెండు సార్లు జిల్లాకు వచ్చిన ఆమె వెంట పెద్ద స్థాయి నాయకులెవరూ లేకపోగా గతంలో పలికిన ఘనస్వాగతాలు కనిపించలేదు.

ఆమె వెంట వెళ్లేదెవరు...

ఐదేళ్ల పాటు ఎంపీగా ఉన్న కవిత ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. జిల్లా కోడలిగా ఆమెకు జిల్లాలో ప్రత్యేక అనుచరగణం ఉంది. బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో ఆమె అనుచరులు ఉన్నారు. తెలంగాణ జాగృతి పేరుతో ఆమె ప్రత్యేక సంస్థను నడుపుతుండగా అందులో కూడా చాలా మంది ఆమె సన్నిహితులు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఆమె వెంట ఎంత మంది వెళ్తారు, ఎంత మంది పార్టీలోనే ఉంటారు అనేవిషయంలో పార్టీ వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికిప్పుడే నాయకులు ఆమె వెంట ఎవరు వెళ్లే పరిస్థితి లేదు. తెలంగాణ జాగృతికి చెందిన వారు తప్ప పార్టీలో ఆమె వెంట వెళ్లేవారు ప్రస్తుత పరిస్థితుల్లో కనిపించడం లేదు. ముందు ముందు ఎలాంటి నిర్ణయం ఉంటుందోనని ఆమె అనుచరులు ఎదురు చూస్తున్నారు. ప్రత్యేక పార్టీ పెడితే కొంత మంది వెళ్లే పరిస్థితి ఉంది. ఇటీవల ఆలూర్‌కు చెందిన నాయకురాలు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా ఆమె చేరిక సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో కవిత ఫోటో లేకపోవడంతో ఆమె అనుచరులు కవిత ఫొటో ఎందుకు పెట్టలేదని అడుగగా వారిని ఆ నియోజకవర్గ బీఆర్ఎస్ వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించినట్లు సమాచారం.

సోషల్ మీడియా వేదికగా మొదలైన వార్..

జిల్లా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు, కవితకు మధ్య 2019 పార్లమెంట్ ఎన్నికల ఓటమి తర్వాత గ్యాప్ వచ్చింది. అప్పటి నుంచి ఆమె జిల్లా పార్టీపై ప్రభావాన్ని కోల్పోయింది. గత కొద్దికాలంగా బీఆర్ఎస్‌లో దయ్యాలు ఉన్నాయని కవిత బహిరంగ వ్యాఖ్యలు, బీసీ బిల్లుపై సంబరాలు, కాళేశ్వరం అవినీతి విషయంలో హరీష్‌రావు, సంతోష్‌రావుల పాత్రపై కవిత చేసిన వ్యాఖ్యలపై జిల్లాలోని బీఆర్ఎస్ లో ఉన్న ప్రజాప్రతినిధుల అనుచరులు సోషల్ మీడియా వేదికగా కవితకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసిన క్రమంలో సోషల్ మీడియా వేదికగా పార్టీ సరైన నిర్ణయం తీసుకుందని పోస్టులు పెడుతుండగా కవిత అనుచరులు సైతం దీటుగా సమాధానం ఇస్తున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ కుట్రలో భాగమే సీబీఐకి అప్పగింత

- కవిత సస్పెన్షన్ విషయంలో పార్టీ సరైన నిర్ణయం తీసుకుంది
- మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ కుట్రలో భాగంగానే కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించిందని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కష్టకాలంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉండాల్సిన ఎమ్మెల్సీ కవిత శత్రువులకు చేయూతనివ్వడంలో మనస్సులు బాధించాయని అన్నారు. హరీష్‌రావు, సంతోష్‌రావులపై చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కవిత సస్పెన్షన్‌ను పార్టీ శ్రేణులు స్వాగతిస్తున్నాయని అన్నారు. కొంత కాలంగా కవిత పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కవిత సస్పెన్షన్ విషయంలో పార్టీ సరైన నిర్ణయం తీసుకుందన్నారు. కేసీఆర్ తన కూతురు కంటే పార్టీ భవిష్యత్తే ముఖ్యమని పార్టీ శ్రేణులకు కవిత సస్పెండ్ ద్వారా విన్నవించారని అన్నారు. కవిత చేస్తున్న ఆరోపణలు ఎవరూ విశ్వసించరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కవిత ప్రభావం ఉండదన్నారు. పదేళ్ల పాటు ఎంపీగా అనంతరం ఎమ్మెల్సీగా ఉన్న కవిత ఎన్నో సేవలు అందించినప్పటికీ పార్టీ సిద్ధాంతాలకు, నియామకాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే సహించేది లేదని అందుకే ఆమెను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు సిర్పరాజు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాష్, బాజిరెడ్డి జగన్, రాజు, చింతకాయల రాజు, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐడీవోసీలో వినాయకుడికి పూజలు

సుభాష్‌నగరు, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వేదబ్రాహ్మణులచే సాంప్రదాయబద్ధంగా కుంకుమ పూజలు జరిపారు. అనంతరం ప్రసాదవితరణలో పాల్గొన్నారు.

మందుబాబుల ఆగడాలను అరికట్టాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో మత్తు పదార్థాలకు అలవాటు పడి అరాచకాలు చేస్తున్న వారిని అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులకు, ఏసీపీ కార్యాలయంలో వినతి పత్రాలను అందజేశారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో కొంతమంది యువకులు గుంపులుగా ఏర్పడి రాత్రివేళల్లో ప్రయాణికులపై దాడులు చేస్తున్నారన్నారు. ప్రయాణికుల వద్ద ఉన్న డబ్బులు, బంగారు నగలు లాగేసుకుంటూ గాయపరుస్తున్నారని అన్నారు. గంజాయి, తదితర మత్తు పదార్థాల వాడకం రైల్వేస్టేషన్‌తో పాటు నాగారం, బస్టాండ్, ఆటోనగర్, చంద్రశేఖర్ కాలనీ, గౌతం నగర్ తదితర ప్రాంతాల్లో అడ్డాలుగా మార్చుకుని అరాచకాలను కొనసాగిస్తున్నారన్నారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో నిఘాలు పెంచాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు పోలీసుల గస్తీ పెంచాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేష్, సుజాత, కటారి రాములు, శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో హోమం, అన్నదాన కార్యక్రమం

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 7వ పోలీస్ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బెటాలియన్ కమాండెంట్ దంపతులు మంగళవారం హోమం కార్యక్రమం నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ధర్పల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముంపు గ్రామాలైన వాడి, నడిమితండా, బీరప్పతండా, ఒడ్డెర కాలనీలో తహసీల్దార్ శాంతా ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ముంపుకు గురైన ఇండ్లతో పాటు పొలాల్లో చేరిన ఇసుక మేటలను పరిశీలించారు. వరద ప్రభావంతో నష్టపోయిన బాధితుల పేర్లను నమోదు చేసుకునే ప్రక్రియ ప్రారంభించినట్లు ఆమె చెప్పారు. పంటనష్టం సైతం అంచనా వేసినట్లు ఆమె చెప్పారు. తుది నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇప్పటి వరకు 422 మంది కుటుంబాలకు ప్రభుత్వం నుంచి నిత్యవసర వస్తువులను పంపిణీ చేసినట్లు ఆమె చెప్పారు. ఆమె వెంట ఆర్ఐ రాజేశ్వర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకే ఐడియా థాన్ కార్యక్రమం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకే ఐడియా థాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కాలేజీలో కళాశాలల ఆవిష్కరణల విభాగం టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో మంగళవారం గిరిరాజ్ కళాశాలలో ఐడియా థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ కాలేజీల నుంచి విద్యార్థులు హాజరై ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎల్లప్పుడూ వినూత్న ఆలోచనలు కలిగి ఉండాలని ఆలోచనలతో సమాజం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు పరిష్కారాలు చూపేలా ఆవిష్కరణలు చేయాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన బాలు ప్రవరాఖ్య మాట్లాడుతూ విద్యార్థులకు జీవనైపుణ్యాలు మెరుగుదిద్దడం ఆవిష్కరణల దిశలో ఆలోచించడం ఎలానో వివరించారు. ఈ కార్యక్రమంలో 25 ప్రాజెక్టులు పోటీలో నిలువగా వాటిలో 10 ప్రాజెక్టులను ఉత్తమమైనవిగా గుర్తించారు. పోటీలో పాల్గొన్న అన్ని ప్రాజెక్టులకు టీహబ్ ద్వారా సరైన మార్గదర్శకత్వం చేసి అర్హత పొందిన వాటికి నిధులను సమకూర్చి స్టార్టప్‌లుగా తీర్చిదిద్దనున్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ముత్తెన్న, డాక్టర్ పి.రామకృష్ణ చంద్రశేఖర్, శ్రీరాం, సంకీర్త్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నిరసనలు


కోటగిరిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ పేరుతో బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వం భారీ కుట్ర పన్నుతోందని జిల్లా బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాళేశ్వర్ ప్రాజెక్టు కమిషన్ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. రాజకీయ కక్షలో భాగంగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిటీని కాదని ప్రభుత్వం సీబీఐ ద్వారా దర్యాప్తు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


రుద్రూర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నగరంలో నిరసన తెలుపుతున్న నాయకులు


వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిమజ్జనోత్సవంలో నిబంధనలు తప్పని సరి

(5వ పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో ఉమ్మెడ మార్గాన్ని, బ్రిడ్జి వద్ద గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. యంచ గోదావరి బ్రిడ్జి తో పాటు, ఉమ్మెడ వద్ద భారీ విగ్రహాల నిమజ్జనం కోసం సరిపడా క్రేన్లను అందుబాటులో ఉంచాలని, తగిన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, జనరేటర్, అంబులెన్సు, మెడికల్ క్యాంపు లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వినాయక బావి వద్ద అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులతో కలిసి నిమ్మజన ఏర్పాట్ల విషయమై కలెక్టర్, సీపీ సమాలోచనలు జరిపారు. జానకంపేట్ రైల్వే క్రాసింగ్ వద్ద హై వోల్టేజ్ విద్యుత్ లైన్ ఉన్నందున ఎనిమిది అడుగుల కంటే ఎక్కువ ఎత్తు కలిగిన భారీ విగ్రహాలను ప్రత్యామ్నాయ మార్గం ద్వారా నిమజ్జనానికి ఉమ్మెడ గోదావరికి తరలించాలని సూచించారు. ఉమ్మెడ వద్ద కూడా నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్ కుమార్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, భైంసా డివిజన్ సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఏసీపీలు రాజావెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మస్తాన్ రావు, మున్సిపల్, ఆర్ అండ్ బీ, అగ్నిమాపక, ఫిషరీస్, పంచాయతీరాజ్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

లెక్క తేలింది...

(5వ పేజీ తరువాయి)

ఆర్మూర్ రెవెన్యూ డివిజన్‌లో 186 గ్రామ పంచాయతీలలో 1824 వార్డులలో మొత్తం 3లక్షల 61వేల 748 మంది ఓటర్లు, బోధన్ రెవెన్యూ డివిజన్‌లో 152 గ్రామపంచాయతీలలో 1354 వార్డులలో 2లక్షల 14వేల 893 మంది ఓటర్లు, నిజామాబాద్ రెవెన్యూ డివిజన్‌లో 207 గ్రామ పంచాయతీలలో 1844 వార్డులలో 2లక్షల 74వేల 779 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆయుష్మాన్‌భవా...!

● పుట్టిన రోజు సందర్భంగా పోలీసులకు హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్‌ను పంపిణీ చేస్తున్న కుటుంబ సభ్యులు

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సీఎస్ఐ కాలనీకి చెందిన బెన్ని, మౌనికల కూతురు అద్విక 5వ పుట్టినరోజు సందర్భంగా 60 హెల్మెట్‌లను పంపిణీ చేశారు. అద్విక తన కిడ్డిబ్యాంక్‌లో దాచుకున్న పొదుపు డబ్బులను ఉపయోగించి 60 హెల్మెట్‌లను కొనుగోలు చేసి ట్రాఫిక్ పోలీసులకు అందజేసింది. ఈ హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్, నుడా చైర్మన్ కేశవేణు, వ్యవసాయ కమీషన్ మెంబర్ గడుగు గంగాధర్, నరాల రత్నాకర్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారి అద్విక చూపిన ఉదారత సమాజానికి ఒక మంచి సందేశం అని అన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు పోకుండా ఉంటాయని అన్నారు. అద్విక ఇచ్చిన బహుమతి అందరికి ప్రేరణగా నిలవాలన్నారు. పొదుపు డబ్బులతో ఇంత గొప్ప సేవా కార్యక్రమం చేయడం చాలా విశేషం అన్నారు. అందరూ ప్రయాణాల్లో హెల్మెట్లు వినియోగించాలని కోరారు. అనంతరం అద్వికతో కేక్ కట్ చేయించి చిన్నారిని ఆశీర్వదించారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

సిరికొండ, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలం గడ్కోల్ గ్రామంలో వరదల వల్ల ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి మంగళవారం బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు ఐదు క్వింటాళ్ల బియ్యం, పప్పులు, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. మూషీర్‌నగర్ గ్రామంలో చిన్న మల్లయ్య ఇళ్లు కాలిపోగ ఆయనకు బియ్యం ఐదువేల నగదును భాస్కర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రొక్కం సంపత్‌రెడ్డి, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు మామిడి రాములు, బాను చందర్, భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు లింబాద్రి, అఖిల్, పంచాయతీ కార్యదర్శి సయ్యద్ ముగ్దుం, కాంగ్రెస్ నాయకులు కిషోర్‌గౌడ్, శ్రీధర్, బుచ్చన్న, ఆకుల జగన్, సంతోష్ నాయక్, దోనిమోహన్, మండల బంజార సేవ సంఘం అధ్యక్షుడు రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

దేవి : కొత్తలోక (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కూలీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : బ్రహ్మండ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సుందరకాండ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్ర్కీన్-1 : బ్రహ్మండ (11.00, 10.30)
: కొత్తలోక (1.25, 4.25) : కూలీ (7.20)
స్ర్కీన్-2 : కూలీ (1.35)
: సుందరకాండ (4.40, 10.30)
: కొత్తలోక (7.30)
స్ర్కీన్-3 : మహావతార్ నరసింహా (1.30, 4.30, 7.30, 10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్ర్కీన్-1 : కొత్తలోక (10.40, 7.25, 10.30)
: మహావతార నరసింహా (1.45, 4.35)
స్ర్కీన్-2 : పరం సుందరి (హిందీ) (10.40, 1.35, 4.30, 7.25, 10.20)
స్ర్కీన్-3 : త్రిబణదారి బార్బరిక్ (11.00, 7.30)
: కన్యాకుమారి (1.45)
: సుందరకాండ (4.35, 10.15)
స్ర్కీన్-4 : కేపీ అగ్రహారంలో అంబేద్కర్ (10.05)
: అర్జున్ చక్రవర్తి (1.00)
: కూలీ (3.45, 10.50)
: వార్-2 (హిందీ) (7.15)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.107,300	రూ.99,000	రూ.1300

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో) :	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో) :	రూ.175	రూ.265	రూ. 285

